క్లుప్తంగా

ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతి



పక్షవాత రోగి జి నాగేశ్వరరావుకు కొత్త పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ళ రాము అన్నారు. ఆదివారం డివిజన్‌లో కొత్త పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఆయన వెంట వైసీపీ కార్యకర్తలు ఉన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే చాంపియన్ షిప్-2023 పోటీల్లో విజయం సాధించిన సెయింట్ మెరిస్ విద్యార్థులు

దెందులూరు: ఏపీ షోటాకాన్ కరాటే ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని విజయదుందుభి మోగించారు. ఆదివారం ఏలూరు టుబాకో కళ్యాణ మండపంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి తనూజ, రెండో బహుమతి మల్లీశ్వరి, విజ్ఞ, అర్పిత మాథ్యూ, త్రిలోచన్, సాత్విక్, సంతోష్ విజయం సాధించారు. తృతీయ బహుమతుల్లో దుర్గా మహేశ్వరి సాధించింది. విజేతలను పాఠశాల హెచ్ఎం సిస్టర్ టీనామరియా, విన్సీలీ మరియా, కరాటే ఇన్‌స్ట్రక్టర్ మణికంఠ, ఇన్‌చార్జి జ్యోతి అభినందించారు.

టీటీడీ మెంబర్ నెర్సుకు ఎమ్మెల్యే సత్కారం



టీటీడీ మెంబర్ నెర్సు నాగసత్యంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

దెందులూరు: తిరుమల తిరుపతి దేవస్థానం మెంబర్ నెర్సు నాగసత్యంను ఆదివారం ఎమ్మె ల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సత్కరించి అభినందించారు. టీటీడీ మెంబర్‌గా నియమితులై తొలిసారిగా మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని నాగ సత్యం కలిశారు.

స్వచ్ఛతా హీ సేవలో ప్రతి ఒక్కరూ భాగం కావాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఆర్టీసీ అధికారులు



నగరాన్ని స్వచ్ఛంగా ఉంచుతామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్లు విజయనిర్మల, తంగెళ్ళ రాము, కార్మికులు



పాలగూడెంలో రోడ్డుపక్కన వ్యర్థాలు తొలగిస్తున్న కలెక్టర్ వెంకటేష్

- పాలగూడెంలో పారిశుద్ధ్య పనులు
- గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ర్యాలీ

ఏలూరు రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పౌరులు ప్రతిరోజూ ఒక గంట శ్రమదానం చేసి పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని కలెక్టర్ వె ప్రసన్నవెంకటేష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ ప్రచారంలో భాగంగా ఆదివారం ఏలూరు మండలం పాలగూడెంలో కలెక్టర్ పర్యటించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రోడ్లపై చెత్త, చెదారం తొలగించారు. చీపురు చేతబట్టి రోడ్లు ఊడ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలన్నారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలన్నారు. దీనివల్ల పరిసరాల పరిశుభ్రత పెరగడంతో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్యాల సునీత, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, డీపీఓ తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్, ఎంపీడీఓ బి ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం సరళ కుమారి, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకర సమాజం రూపుదిద్దుకుంటుందని జిల్లా ప్రజా రవాణా (ఆర్టీసీ) అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఏలూరు ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్, జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి కార్యాలయం వద్ద నిర్వహించారు. డీపీటీఓ కార్యాలయ సూపరింటెండెంట్ పీ. వేణుగోపాలరావు, ఏలూరు డిపో మేనేజర్ బీ.వాణి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు. స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారు. కరస్పాండెంట్ చలసాని విశ్వనాథం, ప్రిన్సిపాల్ పీ. శైలజ, ఐక్యూసీ కో- ఆర్డినేటర్ కే. ఝాన్సీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. అనురాధ పాల్గొన్నారు.సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్, 19 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఏ రామరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం. నవీన్ కుమార్ ఎన్‌సీసీ జెండా ఆవిష్కరించారు. క్యాడెట్లతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కరస్పాండెంట్ కేఎస్ విష్ణు మోహన్ పాల్గొన్నారు.

ఏలూరును పరిశుభ్రంగా ఉంచుదాం

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని ఆహ్లాదకరంగా, పరిశుభ్రమైన రీతిలో తీర్చిదిద్దేందుకు తామంతా కట్టుబడి ఉంటామని స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములం అవుతామంటూ కార్పొరేటర్లు ప్రతిజ్ఞ చేశారు. ఏలూరు నగర 16వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఈసీ మెంబర్ జిజ్జువరపు విజయనిర్మల, 15వ డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ళ రాము ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరపాలక సంస్థ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పార్టీ కార్యకర్తలు తొలుత ప్రజలకు అవగాహన కలిస్తూ ర్యాలీ, పారిశుధ్య పనులు నిర్వహించారు.

బాపూజీ కలను సాకారం చేయాలి

ఏలూరు (టూటౌన్): పరిశుభ్రతే సేవ అనే బాపూజీ స్వచ్ఛ భారత్ అభియాన్ కలను సాకారం చేసేందుకు అందరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆదివారం ఏలూరు వసంత మహల్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు పార్కు వద్ద బీజేపీ ఏలూరు అసెంబ్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నీటితో శుభ్రం చేసి పూల మాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్, ఏలూరు అసెంబ్లీ కన్వీనర్ గాది రాంబాబు, కో-కన్వీనర్ బాడిత నారాయణరావు, మండల అధ్యక్షుడు నడపన దాన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడాలి



గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ పిలుపునిచ్చారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.తొలుత గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు ఎస్. రాజేష్, పీ.శ్యామ్, ఎస్.రాకేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ కృషి



ఎమ్మెల్యే ఆళ్ళనానికి వినతిపత్రం అందిస్తున్న దేవాంగుల సంక్షేమ సంఘ నేతలు, చిత్రంలో మేయర్

ఏలూరు టౌన్: సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ళనాని చెప్పారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో దేవాంగ సంక్షేమ సంఘం, నూర్‌బాషా సంక్షేమ సంఘం ప్రతినిధులు, నేతలు ఎమ్మెల్యే ఆళ్ళనానిని ఆదివారం కలిశారు. ఎమ్మెల్యే నానికి తమ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ళనాని మాట్లాడుతూ నూర్‌బాషా, దేవాంగ సంక్షేమ సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సమాజంలోని వర్గాలు, కులాలు, రాజకీయాలు ఇతర వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలో పేదలకు 30వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలను కేటాయించడంపై వారంతా సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆళ్ళనానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, నాయకులు షేక్ సత్తార్, గాజుల భాజీ, అలంకార్ సుభానీ, భాషా, ఫరీద్, బళ్ళా రవికుమార్, పూర్ణ ప్రసాద్ ఉన్నారు.

విదేశీ కరెన్సీ, స్టాంపుల సేకరణ అభినందనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశ విదేశాలకు చెందిన కరెన్సీ నాణాలను, స్టాంపులను సేకరించడం అభినందనీయమని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరాం అన్నారు. నగరంలోని అక్షర పాఠశాల ఆవరణలో కందుకూరి సుభాష్ ఆధ్వర్యంలో 170 దేశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన కరెన్సీ నోట్లు, నాణాల ప్రదర్శనను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు మాట్లాడుతూ సుభాష్, స్థానిక కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, అక్షర స్కూల్ ప్రిన్సిపాల్ అర్చన చౌదరి పాలడుగు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు



ఎమ్మెల్యే ఆళ్ళనానిని కలిసిన ఏలూరు క్లస్టర్-1 అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఆకాంక్షతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ళనాని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు క్లస్టర్-1 అధ్యక్షుడిగా నియమితులైన కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనానిని కలిశారు. ఏలూరు క్లస్టర్-1 మహిళా అధ్యక్షురాలిగా కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి, యువజన అధ్యక్షుడిగా జిజ్జువరపు రమేష్‌ను నియమిస్తూ ఆళ్ళనాని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వారంతా ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్నారని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, తదితరులు ఉన్నారు.

శానిటరీ మేస్త్రిపై దాడి

భీమడోలు: స్థానిక గ్రామ పంచాయతీ శానిటరీ మేస్త్రి విధులకు ఆటంకం కలిగించి ఆతనిపై దాడి చేసిన ఓ వ్యక్తిపై భీమడోలు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమడోలు పంచాయతీలో శానిటరీ మేస్త్రిగా బొర్చా గంగరాజు విధులను నిర్వహిస్తుండగా అదే గ్రామంలోని అరుంధతీ కాలనీకి చెందిన పెరుమాళ్ల రాజేష్ అనే వ్యక్తి పంచాయతీ ఆఫీసులోకి వచ్చి తన ఇంటి వద్ద దసరా సందర్భంగా దుర్గమ్మ విగ్రహాన్ని కొందరు వ్యక్తులు ఏర్పాటు చేస్తున్నారని అడ్డుకోవాలని, లేని పక్షంలో తాను స్పందనలో ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తూ మేస్త్రి బొర్చా గంగరాజుపై దాడి చేశాడు. అతని చేతిలో ఉన్న హాజరుపట్టీని చించేసి చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు గంగరాజు పోలీసులను ఆశ్రయించాడు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. చిన్నారులు సామూహిక పుస్తక పఠనం చేశారు. . భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు.

ఖాజావలీకి ఏఎన్ఆర్ అవార్డు



ఖాజావలీకి ఏఎన్ఆర్ అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సంస్థ 261వ కార్యక్రమంగా రంగస్థల దర్శకుడు, బహునందుల పురస్కార గ్రహీత ఎండీ ఖాజావలీకి అక్కినేని నాగేశ్వరరావు అవార్డు ప్రదానం చేశారు. ఆదివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఖాజావలీతో పాటు 70 ఏళ్ల నాటక రంగ జీవిత చరిత్రగల సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావు సహస్ర చంద్ర మాస దర్శనోత్సవ వేడుక నిర్వహించారు. సభా కార్యక్రమానికి గరికపాటి ఆర్ట్స్ సంస్థ అధ్యక్షుడు గరికపాటి కాళిదాసు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఉషాగ్రూప్ సంస్థల చైర్మన్ వీవీ బాలకృష్ణారావు, కళారత్న కేవీ సత్యనారాయణ, ఆత్మీయ అతిథులుగా జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు, దత్తపీఠం ప్రతినిధి వేణుగోపాల్ లునాని, తక్కెళ్ళపాటి శేషసాయి, కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధి పెదపాటి రామకృష్ణ, ఎంవీఆర్ఎస్ శర్మ హాజరయ్యారు. ఘంటసాల సంగీత కళాశాల ప్రిన్సిపాల్ రేవతీరామ్ కుమార్ సారథ్యంలో అక్కినేని సంగీత విభావరి నిర్వహించారు.

వృద్ధుల అనుభవాలు పిల్లలకు మార్గదర్శకం



సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): పెద్దల అనుభవాలు పిల్లల జీవితాలకు మార్గదర్శకంగా ఉంటాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక గిరిజన భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మనుష్యుల మధ్య సంబంధాలు తగ్గటం వల్ల వృద్ధుల సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మానవీయ సంబంధాలు కలిగి ఉండటం వల్ల మనుషుల మధ్య ప్రేమాభిమానాలు పెరుగుతాయని తెలియజేసారు. పెద్దలు పిల్లలకు మార్గదర్శకంగా ఉంటారని అన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు, వారి రక్షణకు చట్టాలు అమలు చేస్తోందని అన్నారు. వృద్ధుల జీవనానికి ఆటంకం కలిగిన జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని తెలియజేసారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీసీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజన్స్, సిటిజన్స్ అసోసియేషన్స్, సివిల్ సప్లై అధికారి, డీసీపీఓ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఘన సన్మానం

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా 20 మంది విశిష్ట సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సత్కరించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సారథ్యంలో, జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్రాపు శివరామ కృష్ణారావు అధ్యక్షతన ఆదివారం స్థానిక గిరిజన్ భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన వారిని సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఏడీ ప్రభాకర్, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుకునూరి రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు సాగిరాజు జానకి రామరాజు, ఏలూరు జిల్లా కోశాధికారి వడ్లపట్ల నారాయణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బుగత సన్యాసిరావు, సభ్యులు ఎం.నారాయణ, పలువురు అధికారులు, సిబ్బంది, జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన 80 మంది సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

భూలోకమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏలూరు (టూటౌన్): స్థానిక రెండో డివిజన్లోని బావిశెట్టివారిపేటలోని భూలోకమ్మవారి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు గారపాటి చౌదరిని సత్కరించారు.

ధాన్యం విక్రయించిన రైతులకు హమాలీ చార్జీలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): గత ఖరీఫ్, రబీ కాలంలో ధాన్యం విక్రయించిన రైతులకు ఇవ్వాల్సిన హమాలీ చార్జీలు చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక సుందరవారి తోటలో ఆదివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీ చార్జీలను తక్షణం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి లక్ష్మణరావు, కె.జయరాజు,టి.జగదీష్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నరేంద్రను పరామర్శించిన ఎస్పీ



విజయవాడ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నరేంద్రను పరామర్శిస్తున్న ఎస్పీ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా నూజివీడు సబ్‌డివిజన్ ఆగిరిపల్లిలో వినాయక చవితి సందర్భంగా విగ్రహం నిమజ్జనంలో దుండగులు కానిస్టేబుల్‌పై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అర్ధరాత్రి దాటి రెండున్నర అయ్యిందని ముందుకు సాగాలంటూ కానిస్టేబుల్ గంధం నరేంద్ర గట్టిగా చెప్పడంతో మద్యం మత్తులో వెనుక వైపు నుంచి వచ్చిన ఓ వ్యక్తి పెద్ద కర్రతో కానిస్టేబుల్ నరేంద్ర తలపై కొట్టాడు. తలపై తీవ్ర గాయాలు కావడంతో అతడ్ని విజయవాడ హాస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి విజయవాడలోని హాస్పిటల్‌కు వెళ్లి కానిస్టేబుల్ నరేంద్రను పరామర్శించారు. అతనికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కానిస్టేబుల్ నరేంద్ర కుటుంబ సభ్యులతోనూ మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎస్పీ మేరీ ప్రశాంతితోపాటు నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చిన్నారావుకు నివాళులర్పించిన కొఠారు

పెదవేగి : కుటుంబంలో ఓ వ్యక్తిని కోల్పోవడం ఎవ్వరూ తీర్చలేని లోటని ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండం రాయన్నపాలెంకు చెందిన పలగాని చిన్నారావు ఆదివారం మృతి చెందారు. ఈ విషయమై సమాచారం అందుకున్న కొఠారు చిన్నారావు భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ పరామర్శలు స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

గణపవరం: ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులో నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీని ఏలూరు ఆర్డీఓ కాజీవల్లీ ఆదివారం తనిఖీ చేశారు. కాలనీలో ఇళ్లనిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కె.జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఎలిశెట్టి పాపారావుబాబ్జి పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుడికి మెరుగైన వైద్య సేవలు

దెందులూరు: బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఏలూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కామవరపుకోట గ్రామానికి చెందిన పల్లె వెంకటరమణకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఆదివారం జిల్లా వైద్యాధికారులు ఏలూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులతో ఎంపీ ఫోన్‌లో మాట్లాడారు. వెంకటరమణకు మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. ఎంపీ సూచనల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ, కామవరపుకోట వైస్ ప్రెసిడెంట్ మేడూరి రంగబాబు ఆదివారం ఏలూరు వైద్యశాలలో బాధితుడిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	01
డి.తిరుమల ఏలూరు బీహెచ్‌ఈఎల్	22.15	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	04
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	17

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	01
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05-07
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	40
కాకర కాయలు	24	కీరా దోస	38
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	120-240
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	32	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	06
దోసకాయలు	20-26	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	--